# ఆదర్శయువతి; పద్మ

శ్రీమతి కుమారి బి. రాజేశ్వరి

పద్మ ఏమిటో ఆలోచిస్తూ కూచుంది కుర్చీలో. చిన్న విజిల్ వేసుకుంటూ వచ్చాడు మోహన్. "ఓహో మోహన్ ఎప్పుడేంటి రావడం రా కూర్చో" అంటూ ఆహ్వానించింది పద్మ. "నిన్న సాయంత్రమే వచ్చాను; అంతా కులాసాయేనా. ఏమిటి విశేషాలు" అంటూ సంభాషణ మొదలు పెట్టాడు మోహన్. "ఈవూరి విశేషాలకేమి లే. ఏమైనా వింతలూ విశేషాలు నువ్వే చెప్పాలి; పట్నం నుంచి వచ్చేవారయెను." "నిజమే పద్మా పట్నం జీవితం ఎంత ఆనందంగా వుంటుందనుకున్నావ్! కొత్త కొత్త సినిమాలు, అందమైన పార్కులు; ఫ్రెండ్స్‌తో కలిసి బీచికి పోతోంటే నిజంగా స్వర్గలోకంలో విహరిస్తున్నట్లే వుంటుంది. అందులో మాకేమిటి! మమ్మల్నే వాళ్లందరు. సర్వస్వతంత్రులం." అంటూ తన గడచిన పట్నం జీవితం నెమరు వేసుకుంటున్నాడు మోహన్. "అవునవును దార్లో ఎక్కడైనా అమ్మాయిలు కనిపిస్తే హేళన చెయ్యటం, ఘోజులివ్వటం ఓ ఆనందమేకదూ" "ఆ. ఏమిటో మా కాలేజీ స్టూడెంట్స్‌కి అదో హాబీ అయిపోయింది." ఒకరి ఆశయాల్తో ఒకరు ఏకీభవించలేక పోయేవారు. ఇద్దరూ ఎప్పుడూ కలుసుకున్నా ఏదో వాదన వేసుక్కూచునేవారు.

మోహన్ ఒక సామాన్య కుటుంబంలో జన్మించాడు. పట్నంలో బి. ఏ. పూర్తిచేసుకుని వచ్చాడు. చూడ్డానికి ఆకర్షణీయంగా బాగానే వుంటాడు.

సావిత్రమ్మ, రమణయ్య పంతులు గార్లకి లేక లేక కలిగిన ఏకైక సంతానమే పద్మ. కొద్దో గొప్పో ఆస్తికలవాళ్లే. ఇక పద్మ సౌఖ్యానికి ఏలోటు లేదని వేరే చెప్పాలా. ఎఫ్. ఏ. తో చదువు చాలించింది. పద్మా మోహన్ లిరువురూ స్కూల్ ఫైనల్ వరకూ కలిసి చదువుకున్నారు. ఆ స్నేహాన్ని పురస్కరించుకుని శెలవుల్లో స్వగ్రామం వచ్చినప్పుడల్లా పద్మ గారింటికి వెళ్ళడం పరిపాటే మోహన్ కి. చిన్నప్పటినుండి స్నేహంగా వుండటం మూలాన పద్మా మోహన్ లకి పెళ్ళిచేస్తే బాగుంటుందనుకొనే వారు పెద్దవాళ్ళు.

పంతులుగారు భోజనంచేసి పేపరు తిరగేస్తూ కూచున్నారు. ఇంట్లో పని పూర్తిచేసుకుని వచ్చింది సావిత్రమ్మ. "ఏమండీ ఏంచేశారు అమ్మాయి సమంధంమాట? అబ్బాయికూడా చదువు పూర్తి చేసుకుని వచ్చాడుమరి. 'శుభస్యశీఘ్రం' అని ఏదో శుభకార్యం కాస్తా పెందలాడేచేస్తే బాగుంటుంది." "పొద్దున్నే శాస్త్రిలుగారు చెప్పారు ఎక్కువ కట్నం పుచ్చుకునే వుద్దేశంలో వున్నారు వాళ్లు అని" "కట్నానికేంలేండి. మనకి మాత్రం ఏమంత పదిమంది వున్నారని. ఎప్పటికైనా ఆస్తంతా అమ్మాయికేకా. ఏదో కొంత పెళ్ళిలోనే కట్నం రూపకంగా ఇస్తే గొప్పగానూ వుంటుంది. పిల్లాడు చదువుకున్నాడు. బంగారంలా వుంటాడు. అయినా అమ్మాయి ఉద్దేశంకూడా కనుక్కుందాం ఉండండి. ఏం అమ్మా! ఈ సమంధం నీకు ఇష్టమేనా." "కట్నం విషయంలోనైతే నా అసమ్మతిని తెలుపవలసొస్తుందమ్మా." "అదేమిటమ్మా అలా అంటున్నావ్. ఇప్పుడు ఎక్కడైనా అప్పుతేవాలని భయమా. ఏవస్తువులైనా అమ్మేయాలని భయమా. ఏదో సబంధం మంచిదవుతే కట్నం ఎంతైనా ఇవ్వడానికి మనకి ఏంకష్టంలేదుకదమ్మా" "అదికాదు నాన్నా. మనకింత డబ్బువుంది మనం కట్నం ఇవ్వగలం. ఇదే డబ్బులేని పేదవాళ్ళవుతే ఏంచెయ్యగలరు? పోనీ డబ్బున్నవాళ్ళు కట్నంఇచ్చి

కన్యనిస్తే లేనివాళ్ళు కట్నంలేకుండానే పిల్లనిస్తామంటే ఊరుకుంటున్నారా? డబ్బున్నవాళ్ళు ఇచ్చారని లేనివాళ్ళ నిమ్మనమంటే ఎలా ఇవ్వగలరు నాన్నా? ఈ కట్న పిశాచి యినుపపాదాల క్రింద ఎంతమంది అమాయిక కన్యలు బలిఅవుతున్నారో ఎన్ని కుటుంబాలు నాశనమౌతున్నవో చూడండి! కట్నం విషయంలోనైతే నాకేమాత్రం ఇష్టంలేదు. క్షమించండి!" అంటూ చర్రున అక్కడినుండి వెళ్ళిపోయింది. "సరే ఆలోచిద్దాం" అంటూ వేడి నిట్టూర్పు విడిచారు ఆ దంపతులు.

ఆ మరునాడు "ఏమన్నారండీ తండ్రీ, కొడుకు వచ్చారు కాబోలు." "ఏమంటారు? 10 వేలకి తక్కువ కట్నం లేకుండా పెళ్ళిమాట తలపెట్టరట వారు. అసలు విషయమేమిటంటే అబ్బాయి చదువు సందర్భంలో కొంచెం అప్పుచేశాడట ఆయన. అదిగాక ఎనిమిది ఏళ్ళది ఒక అమ్మాయివుందికదూ ఇంకా. దాని పెండ్లికి కట్నం అని ఇప్పటినుండీ జాగ్రతపడుతున్నాడని ఆ భైరవశాస్త్రిలుగారు చెప్పారు." "ఇంతకీ అబ్బాయి ఏమన్నాడు." "తండ్రి యిష్టమే తన యిష్టమ"ని చెప్పాడు. "అమ్మాయిచూస్తే ఇలా అంటుంది. ఈ సమంధం పూర్తిగా వదులుకోవలసిందేమనం" "పోనీలెండి ఏదో చిన్నప్పటినుండీ స్నేహంగా వున్నవాళ్ళం కదా అని కానీ లేకపోతే అమ్మాయి కెక్కడా దొరక్కపోదులెండి మంచి సమంధం. దాని ఇష్ట ప్రకారమే చేద్దాం." పక్క గదిలోంచీ సంభాషణంతా వింది పద్మ. ఏవేవో ఆలోచనల్తో ఆ లేత హృదయం కదిలిపోతోంది. "పవిత్ర భారత దేశాన్కి భావిపౌరులు కాబోయే నేటి చదువుకున్న యువకులే కట్నం అనీ, తమ తోటిదేలోకం అనీ ఇలా స్వార్థంతో అజ్ఞానంగా ప్రవర్తిస్తుంటే దేశం ఏంబాగుపడ్తుంది? 'తండ్రి ఇష్టమే తన ఇష్టమట' ఏం, తన ఇష్టం వచ్చినట్టు డబ్బు ఖర్చుపెట్టి బాగా జల్సాగా తిరిగినప్పుడు తండ్రి ఇష్టా యిష్టములతో పనిలేక పోయిందేం. అప్పుడైతే సర్వస్వతంత్రుడైయాడా-ఇప్పుడు కాకపోయేడా. కష్టపడి అప్పుచేసి చదువు చెప్పించినందుకు తను కష్టపడి ఉద్యోగంచేసి అప్పుతీర్చి తండ్రిని సుఖపెట్టాలి కానీ మధ్యన పిల్లనిచ్చే మామగారా ఆ అప్పుతీర్చేది? ఎంత న్యాయంగావుంది! చిన్నప్పటినుండి ముద్దుగా పెంచి పెద్దచేసి అల్లుడిచేతిలో పెట్టటంచాలదు. ఉన్న భూమి పుట్ర అమ్ముకునో, అప్పుచేసో అమ్మాయిని చేతిలోపెట్టి వీళ్ళా మనశ్శాంతి లేకుండా కృశించిపోవలసిందేనా? అందుకనే ఆడపిల్ల అంటే అంత హీనంగా చూస్తారు. ఆడపిల్ల పుట్టిందంటే మొహం ముడుచుకుంటూరు. ఛీ! ఛీ! ప్రతి స్త్రీ కూడా ఒకరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించే శక్తికలిగి వుండాలి. ఆ నాడే కట్నపిశాచిని అరికట్టకలిగేమార్గం లభిస్తుంది." ఇంకా ఏవేవో భావాలు ఆమె మనోవీధిలో రైలుబండిలా పరిగెడ్తున్నాయి.

ఆ వేళ రమణయ్య పంతులుగారితోకూడ ఓ అబ్బాయి వచ్చాడు. పాతికేళ్ళలోపు వయస్కుడు. ఆ నొక్కు నొక్కుల జుత్తు, చక్కని శరీరచ్ఛాయ చూడ్డాన్కి ఎంతో ఆకర్షణీయంగా వున్నాడు. కానీ ఎందుకో అతను చాలా విచారంగావున్నాడు. పంతులుగారు లోపల కొస్తూనే "ఏమేవ్ ఇదుగో చూడు ఈ అబ్బాయిని లోనికి తీసుకువెళ్ళి భోజనం పెట్టు. పాపం రెండురోజులనుండి భోంచెయ్యలేదుట. ఊ-త్వరగా" "అయ్యోపాపం! రా నాయనా భోంచేద్దువుగాని" అని లోనికి తీసుకెళ్ళింది. "ఎవరు నాన్నా ఆ అబ్బాయి" అంటూ వచ్చింది పద్మ. "ఎవరోనమ్మా బ్రాహ్మలబ్బాయిట. రెండు రోజులనుండి భోజనంలేదుట. ఏమైనా డబ్బులుంటే ఇమ్మన్నాడు. ఈ రోజుల్లో ఏహోటల్లో సౌఖ్యంగా తిండి దొరుకుతోందమ్మా? అంచేత మన ఇంటికి తీసుకునివచ్చాను. అబ్బాయి చూస్తే సాంప్రదాయంగల కుటుంబంలోని వాడిలాగే వున్నాడు."

"ఏం నాయనా భోంచేశావా. రా కాసేపు కూచో. ఏవూరునుండి వచ్చావ్? నీ తలి తండ్రు

లెవరు చెప్పు నాయనా." "ఆదరించి నా ప్రాణం కాపాడిన దాతలు మీరు- అంతగా అడగాలా నా జీవితచరిత్ర చెప్తా వినండి" సావిత్రమ్మ గారుకూడా వచ్చి కూచుండి. మొదలు పెట్టాడు.

"నా పేరు వేణుగోపాలరావు. అందరూ వేణు అని పిలుస్తారు నేను ఇంటర్ రెండో ఏడాది చదువుతూ మానేశాను. తల్లి, తండ్రి, ఒక చెల్లి నేను ఇది మా కుటుంబం. మేం ధనవంతులం కాం. ఏదో పెద్దలు సంపాదించి పెట్టిపోయిన ఓ చిన్న పెంకుటిల్లు మాత్రం వుండేది. మా నాన్న గుమస్తా పని చేసేవారు. ఒకరిచేత మాటపడకుండా ఎంతో గౌరవంగా బ్రతికిన కుటుంబం మాది. అప్పటి మా జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండా ఎంతో నిశ్చలంగా గడిచిపోయింది. నేను స్కూల్ ఫైనల్ పాసయ్యా. స్కాలర్‌షిప్ వుండటం మూలాన కాలేజీలో చేరా. చెల్లాయికి యుక్తవయస్సు వచ్చింది. కట్నపిశాచి ప్రళయతాండవం చేస్తున్న ఈ రోజుల్లో సామాన్య కుటుంబాల్లోని కన్యలకు వివాహం చెయ్యడం మాటలా? మా నాన్న రెండేళ్ళు కాళ్ళు అరిగిపోయేటట్లు తిరిగారు. లాభంలేకపోయింది. ఎక్కడచూసినా కట్నదేవత ప్రత్యక్షం. సంఘం మమ్మల్ని నిలువనియ్యలేదు. లేనిపోని మాటలు ఆడిపోసుకుంది. చివరకు నాన్న భరించలేక విసికిపోయి ఉన్నయిల్లు కాస్త అమ్మేసి తక్కువ కట్నంతో ఎలాగో చెల్లాయి పెళ్ళి చేశారు. తరువాత తెలిసింది - అతను కోపిష్ఠి, జూదరి అని. ఏంచేస్తాం- చేతులు కాలాక ... పెండ్లి సందర్భంలో కొంత అప్పుకూడా తీయాల్సొచ్చింది. ఇప్పుడు మేం ఒక పూరి గుడిసెలోకి బసమార్చాం. అప్పు తీరేవిధం కనిపించలేదు. పోనీ నేనే ఏదైనా ఉద్యోగం చేద్దామని ప్రయత్నించా. ఈ నిరుద్యోగపు రోజుల్లో నా ప్రయత్నం ఫలించలేదు. ఈ బెంగతోనే నాన్న మంచంపట్టి ఆఖరికి జీవితం కూడా చాలించారు. ఇక అమ్మ అసలే ధైర్యంలేనిది. ఈ స్వార్థపూరిత లోకంలో నన్నొక్కడినీ విడిచేసి నాన్నగార్ని చేరుకుంది. పోనీ ఏదైనా కూలీపని చేద్దామా అనుకున్నా. 'పువ్వులమ్మిన ఊళ్ళో కట్టెలమ్మలేం' అన్నట్టు ఆత్మాభిమానం ఒకటి చావలేదుగా- నన్నా పని చేయనీయలేదు. ఇలా ఈ వూరు వచ్చేశా. రెండు రోజులనుండి ఏదైనా నౌకరీ దొరుకుతుందేమో అని ప్రయత్నిస్తున్నా. నాకైతే చదువుకోవాలనేవుంది. కానీ నా కోరిక నెరవేరలేదు ఇదీ నాజీవితచరిత్ర ఇక నేను శెలవ్ తీసుకుంటా." ఆదరించి నా ప్రాణం కాపాడిన దాతలు, మీఅందరికీ నాకృతజ్ఞతా పూర్వక వందనములు" అంటూ లేచాడు.

"ఇప్పుడెక్కడికి వెళతావ్ నాయనా. ఏదో ఆ ఇంటర్ కాస్త పూర్తిచేస్తే నీ దారిన నువ్వు బతకొచ్చు. దానికయ్యే ఖర్చు నే చేస్తా. నువ్విక్కడే వుండి చదువుకుంటావా" "ఆ! నాకంత అదృష్టమా- తప్పకుండా అలాగే చదువుకుంటా" అప్పట్నుంచీ వేణు అక్కడేవుండి చదువుకుంటున్నాడు. అతని సత్ప్రవర్తన, వినయవిధేయతలూ చూసినవారు ఎంతో ముచ్చటపడేవారు. ఎప్పుడూ చదువుకుంటూనో వ్రాసుకుంటూనో కూచునేవాడు. పరీక్షలయ్యాయి. ఆ వేళ మధ్యాన్నం వేణు భోజనానికి వెళ్ళినప్పుడు అతని గదిలో టేబిల్ మీదనున్న కాగితాలు తీసి చూసింది పద్మ. ఏవో కథలూ, గేయాలూను. సాయంత్రం తోటలో కూచుని మెల్లిగా పాడుకుంటున్నాడు వేణు. "ఈ గీతం నువ్వు వ్రాసిందేకదూ వేణూ" అంటూ వచ్చింది పద్మ. "అవును పద్మా, నీకెలా తెలిసింది." "ఎప్పుడూ ఏదో వ్రాస్తూనో చదువుతూనో కూచునేవాడివి మరి. ఏమిటి వ్రాస్తున్నావో చూడాలనిపించింది. నువ్వు భోజనానికి వెళ్ళినప్పుడు నీ గదిలోకి వెళ్ళి చూశాను; క్షమించు" "ఎంతమాటన్నావ్ పద్మా నిజంగా మీసహాయం లేకపోతే నేనేమయ్యేవాడినో ఇంకా ఎన్నికష్టములకి లోనుకావలసినవాడినో." "దానికేమిటివేణూ తోటి మానవులమైన మనం ఒకరియందొకరం ఆ పాటి సహాయం, సానుభూతితో వుండకపోతే ఎలా? అవును కానీ వరకట్నాల గురించి అంత ఘాటుగా

విమర్శించావ్ అంత హీనంగా చూస్తూ వ్యాసం వ్రాశావ్. మరి కట్నం లేకుండానే వివాహం చేసుకుంటావా నువ్వు? అయినా ఆదర్శానికి, ఆచరణకి చాలా దూరం వుందికదూ. బి. ఏ. కి 10 వేలకి తక్కువ లేకుండా కట్నమైతే ఎఫ్. ఏ. చదివావ్ 5 వేలకి తక్కువరాదులే కట్నం. కోరితే ఇంకా ఎక్కువే వస్తుంది. అయినా మీ యువకులంతా అంతే. చెప్పే దొకటి, చేసేదొకటి. మహా సంస్కర్తలలా వుపన్యాసాలు దంచేయడమే కానీ తీరా సమయం వచ్చేసరికి వారి ఆశయాల్ని ఆచరణలో పెట్టలేరు" కోపంతో మాట్లాడేస్తుంది పద్మ.

"కేవలం తప్పంతా పురుషులదే అనటం పొరపాటు పద్మా. అయినా నా విషయం చెప్తున్నా. భవిష్యత్‌లో నా జీవితం సుఖంగా సాగిపోతుందని నేనెప్పుడూ అనుకోవటంలేదు. అలాటి నేను వివాహ విషయమే తల్చుకోను. ఒకవేళ అలా సంభవిస్తే నేనొక ఆదర్శ జీవిననీ, నా ఆశయాల్ని ఒక కలంవరకే కాకుండా ఆచరణలో పెట్టేవాడినని లోకం నన్ను గుర్తించగలదు. ఈ వరకట్న మహామారివలన మాలాటి సామాన్య సంసారాలు ఎలా చితికిపోతున్నాయో అనుభవించిన వాడిని నాకు తెలుసును. నా సోదర మానవులు ఇలాటి బాధలకి గురికావడం నేను సహించలేను. ఎప్పటికైనా సంఘంలోవుండే దురన్యాయాలనీ, కట్నపిశాచిని అంత మొందించాలనే నా నిశ్చయం, అందుకే నేను ఇంకా జీవించివున్నా లేకపోతే ఏనాడో నా తల్లితండ్రుల్ని కలుసుకునేవాడిని" ఆవేశంతో మాట్లాడేస్తున్నాడు. (అదియే కాలేజీ ప్లాటుఫారం అనుకొన్నాడు కాబోలు.)

'వేణు హృదయం ఎంత లోతైనది. ఏకష్టాలు లేనివాడిలా ఎంతో అమాయకంగా కనిపిస్తాడు. మెత్తని హృదయం, విశాల భావాలు కలవాడు. ఏజాతి అవుతేనేం, నేనే ఇతన్ని ఎందుకు వివాహం చేసుకోకూడదూ.' అనుకొంటుంటే పక్కగదిలోంచి ఏవో మాటలు వినిపించాయి. తన ఆలోచనల్ని కట్టిపెట్టి శ్రద్ధగా వింటూంది పద్మ.

"ఏమేవ్ మనింట్లో వుంటూన్న వేణు ఎవరబ్బాయనుకున్నావ్. మన వెంకన్న పంతులుగారబ్బాయేనే. మంచి నడత, బుద్ధి తండ్రికేం తీసిపోడు. అందుకే పెద్దవాళ్ళు మంచి వంశం, మంచి సాంప్రదాయం అంటారు. చూశావా మనం అడుగుతే తండ్రిపేరు చెప్పలేదు. చిన్నతనం అని." "మీకెలా తెలిసిందండీ వెంకన్నగారబ్బాయి అని" "ఇంకా అడుగుతున్నావా వాళ్ళవూరతను ఎవరో వచ్చాడు. వేణు అనే అబ్బాయి మీ ఇంట్లోవుండి చదువుకొంటున్నాడట నిజమేనా అని అడిగాడు. అవును ఎవరి అబ్బాయి అతను అని అడిగా. ఫలానా వెంకన్న పంతులుగారబ్బాయి. చాలా మంచివారండీ ఎంతో గౌరవమైన కుటుంబం వారిది. పాపం, విధి వాళ్ళనలా చేసింది అంటూ చెప్పాడు. చిన్నప్పుడు మేం ఇద్దరం ఎంతో స్నేహంగా వుండేవాళ్ళం. ఇలా పొట్టకోసంఅని విడిపోయాం. ఒకరిజాడ మరొకరికి తెలియకుండానే ఇన్నేళ్ళు గడిచిపోయాయి. మళ్ళా విధి మనల్నిలా కలిపింది." "ఆహా, అలా అయితే మన అమ్మాయిని ఆ అబ్బాయికెందుకు ఇచ్చి వివాహం చేయకూడదు? మంచి సాంప్రదాయం. పిల్లడు బాగుంటాడు. ఒక్కగానొక్క అమ్మాయి అయినందుకు అల్లుడు, కూతురు మన దగ్గరే వుంటారు" "చూదాం. అయినా అమ్మాయి అభిప్రాయం కనుక్కోవద్దూ" సంభాషణంతా విన్న పద్మ. హృదయం పట్టలేనంత ఆనందంలో మునిగిపోయింది.


కాలం మహాప్రవాహంలా దొర్లిపోతోంది. కొన్ని ఏళ్ళు గడిచిపోయినై. ఇప్పుడు వేణు యమ్. బి. బి. యస్. డాక్టరు. ఇప్పుడు పద్మ వేణూలకి ఓ చిన్నపాపకూడాను. ఇక ముసిలిదంపతులకేం పనిలేదు. సంసారం బాధ్యత కూతురు అల్లుడికి అప్పచెప్పేసి రామాయణ భారతములు చదువుకుంటూ, చిన్ని మనుమనితో కేరింతాలుకొడ్తూ

నిశ్చింతగా జీవితశేషం గడుపుతున్నారు. కాక పోతే తమ ఆస్తి అంతా మనుమనిపేర వ్రాసేస్తే ఇక ఏవిచారము లేదు.

తండ్రి ఉద్దేశము గ్రహించింది పద్మ. "నాన్నా నేనో విషయం చెప్తాను. మీరేమీ అనుకోరుకదా." "అదేమిటమ్మా చాలా కొత్తగ మాట్లాడుతున్నావ్ ఏమిటి చెప్పమ్మా." "ఏదో మీదయవలన జీవితం సుఖంగా సాగిపోయే మార్గం ఏర్పడింది. అలా సాగిపోతూందికూడా. ప్రస్తుతం మనదగ్గరున్న మూల ధనముతో మనపెద్దమేడలో ఓ శరణాలయం స్థాపించి ఏటా వచ్చేరాబడి అందుకోసం వినియోగించి అనాథలకి నిస్సహాయులకి సేవచేయాల్నుంది. నాన్నా ఏమంటారు," "మీఇష్టమేనమ్మా ఈ సంసారం బాధ్యత అంతా మీకే వదిలిపెట్టాను."

తల్లి తండ్రి పేరున ఓ శరణాలయం స్థాపించారు పద్మా, వేణులు. అనాధలయిన స్త్రీలనూ దిక్కులేని బాలబాలికలనూ చేర్పించి చదువుచెపుతూ ఏదో ఒక వృత్తితో జీవనోపాధి గడపగలిగే శిక్షణనిస్తూ, బీదలైన రోగులకు సహాయంచేస్తూ, తమ శక్తికొలదీ మానవసేవచేస్తూ ఆదర్శ దంపతులవలె జీవిస్తున్నారు పద్మా వేణులు.

ఖర్చుతక్కువ ఫలమధికము!



మీరిక ధనము అధికముగా వెచ్చించి మోటారుకార్లకు, లారీలకు, బస్సులకు క్రొత్త టైర్లు కొననవసరములేదు!

మీపాతటైర్లనే క్రొత్తవిగా సరసమయిన చార్జీలకు తయారుచేసి యివ్వగలము. మానాణ్యమైన పనితనము మీకు తప్పక తృప్తికలిగించగలదు.

అన్ని సైజులలో తయారయిన టైర్లు కూడ అమ్మకమునకు సిద్ధముగానున్నవి.

వివరములకు: జయకేసరి కంపెని,
15 వెస్టుకాట్ రోడ్డు,
రాయపేట, మద్రాసు 14.